కలిసిరావాలి

డబ్బు చెయ్యటం కూడా ఒక రొమాన్సే. ప్రణయ కథలు ఆకర్షించటం మానేశాక ప్రతివాళ్లు డబ్బు కథలు చదవాలి.

ఇది డబ్బు కథ. రొమాన్సు- అంటే నూటికీ కోటికీ తప్ప జరిగే కథ కాదు. ఇందులో నీతికూడా వుంది. ప్రపంచానికి డబ్బుతో అవసరం హెచ్చుతున్నకొద్దీ ప్రజలకు డబ్బుమీద అదోవిధమైన ఏవగింపు కలుగుతున్నది. ఇదీ పెద్దపొరపాటు. డబ్బు ఆరోగ్యకారి. ఉల్లాసం యిస్తుంది. కీర్తీ, ఘనతా ఇవ్వటం మాట చెప్పనే అక్కర్లేదు. డబ్బు విజ్ఞానం కూడా ఇస్తుంది. అనేక పుస్తకాలు చదివినవాళ్లూ, ఎంతో అనుభవం ఉన్నవాళ్ళూ తెలుసుకోలేని సంగతులు డబ్బున్నవాడికి ఇట్టే తెలిసిపోతాయి. డబ్బున్నవాళ్ళు కవులకు ఎట్లా కవిత్వం రాయాలో, చిత్రకారులకు బొమ్మలెట్లా గీయాలో, గాయకులకు పాటలెట్లా పాడాలో, నటులకు నాటకం ఎట్లా ఉండాలో చెప్పటం నేను స్వయంగా చూశాను. ఇంతేకాదు వాళ్లు డబ్బున్నవాళ్ళు చెప్పినట్లు చెయ్యటం చూశాను. దాంతో నా సందేహాలు రహితమైనాయి.

దురదృష్ట వశాత్తూ నేను కథానాయకుడి నిజమైన ఊరూ పేరూ బయట పెట్టటానికి లేదు. సహజ వినయసంపన్నుడైన రంగయ్యగారు ప్రచారమంటే హడలిపోతాడు. గబ్బిలానికి చీకట్లో యెంత సుఖంగా వుంటుందో అజ్ఞాతంగా ఉండటం రంగయ్యగారి కంత సుఖంగా ఉంటుంది. అందుచేత రంగయ్యగారి పేరు బయటపెట్టను.

అసలు రంగయ్యగారిది కుగ్రామం. ఆయన కడుబీద కుటుంబంలో జన్మించాడు. ఆయన చిన్నతనంలో ఏపూటా పొట్టనిండా తిని ఎరగడు. ఆయనకు వాళ్ళ వాళ్ళు అక్షరాభ్యాసం కూడా చెయ్యలేదు. ఇప్పటికీ ఆయన నిరక్షరుడనే చెప్పాలి.

“చదువు రాకపోవటం నాకు చాలా లాభించింది. మన దేశానికి పాఠశాలలే అనర్థంగా ఉన్నాయని నా గట్టి నమ్మకం” అంటాడాయన.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. అతి బాల్యం నుంచీ కూడా రంగయ్యగారిలో డబ్బు కూడబెట్టే లక్షణమూ పొదంచేసే లక్షణమూ కూడా కనిపిస్తాయి. వాళ్ళింట్లో పోపుల పెట్టెలోగాని, తండ్రి పడుకునే మంచం మీద దిండు కిందగాని కానీ, అర్ధణా, బేడా,

పావలా దొరికితే రంగయ్యగారు దాన్ని భద్రంగా తీసి ఎవరికంటా పడకుండా దాచేవాడు. ఆయన తండ్రిగారి పాతికేళ్ళ హయాములోనూ దొరికినంత అప్పు చేశాడు గాని ఎర్ర ఏగానీ కూడబెట్టిన పాపాన పోయి ఎరగడు. రంగయ్యా, పదేళ్ళు దాటకముందే దాదాపు పదిరూపాయలు పోగుచేసి దాచాడు. రంగయ్య తండ్రి ఉత్తర క్రియలకు కూడా మిగుల్చుకోకుండా చచ్చిననాటికి రంగయ్య దగ్గిర పాతికరూపాయలకు తక్కువ లేవు. అయినా డబ్బు దుర్వ్యయం చేసే దురభ్యాసం లేనివాడు కావటంచేత తండ్రి దినవారాదికాలకు లోకుల్ని చందా వేసుకోనిచ్చాడు.

ఆ రోజుల్లోనే రంగయ్యకు పోటీపద్ధతిలో విశ్వాసం ఉండేది. ప్రపంచం యావత్తూ పోటీమీదే ఆధారపడి ఉంది. పాము కందకుండా తప్పించుకున్న కప్పలు పిల్లల్ని పెట్టి తమ వంశాలను వృద్ధి చేసుకుంటాయి. యుద్ధాలు జరిగితే చచ్చినవాళ్ళు కీర్తి సంపాదిస్తే, బతికినవాళ్ళు రాజ్యాలేలారు. వ్యాపారంలో అవతలవాణ్ణి చంపగల వాడే నెగ్గుతాడు అంటాడాయన.

ఈ పోటీ పద్ధతి ననుసరించి రంగయ్య తనకంటె చిన్న పిల్లలచేతిలో కానీ, అర్ధణా కనిపిస్తే వెంటనే పుచ్చేసుకునేవాడు. మనకంటె బలహీనుణ్ణి చెయ్యిదాటి పోకుండా ఉండటమూ మనకంటె బలవంతుడికి చిక్కకుండా ఉండటమూ పోటీలో ప్రధానాంశాలు.

"బలంతో గెలవదగినవాడిని బలంతో గెలు. బలంతో గెలవలేనివాడిని యుక్తితో గెలు" అంటాడు రంగయ్యగారు.

తాను జయించలేని వాళ్ళుంటూ ఉంటారని రంగయ్య ప్రాణం పోయినా ఒప్పుకోడు. అపజయమనేమాట ఆయన నిఘంటువులో లేదు. తనకంటె ధనికులను చూస్తే ఏదో చెప్పరాని దాహమూ ఆకలీ పుట్టుకొచ్చేవి. వాళ్ళచేతిలో డబ్బు ఎంత, ఎట్లా, ఎప్పుడు తన చేతిలోకి వస్తుందా అని నిద్రాహారాలు లేకుండా ఆలోచించేవాడు. కాని, ధనికులమీద ఆయన ఎప్పుడూ కోపంగాని అసూయగాని చూపేవాడుకాదు. చెట్టునున్న వంకాయమీద మన కోపమూ, అసూయ చూపుతామా? తరుణం కోసం వేచి ఉండి, తప్పనిసరి అయితే చాటుగా కోసేసుకుంటాం బస్!

"నీళ్ళతో పనివుంటే చెరువుదగ్గిరికి పోవాలి. డబ్బుతో పనివుంటే డబ్బున్న వాళ్ళ దగ్గిరికిపోవాలి" అంటారు రంగయ్యగారు.

ఆయన ఎప్పుడూ డబ్బున్న వాళ్ళవెంటే ఉండేవాడు. వాళ్ళు తనను హీనంగా చూస్తారని ఆయనకు విచారం లేదు. వాళ్ళు తిట్టినా, కొట్టినా, మీద ఉమ్మేసినా ఏమీ అనుకునే వాడుకాడు. కాళ్ళు బురదకాకుండా వ్యవసాయం ఎట్లా చేస్తావు?

"దురభిమానం, డబ్బు విలువ తెలియనివాళ్ళ వినోదం ఖర్చుతో కూడుకున్నది" అంటారు రంగయ్యగారు.

రంగయ్య చిన్నతనంలోనే మనుషులను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించే వాడు. "నీకర్థంగానిదాన్ని నీకు కావలసిన విధంగా మార్చలేవు" అని మార్క్సిస్టు సూత్రాన్ని రంగయ్య పసితనంలోనే అర్థం చేసుకున్నాడు.

వాళ్ళ ఊళ్ళో నెలకు ఇరవైరోజులు జూదం నడిచేది. రంగయ్య అక్కడ చేరి జూదం ఆడేవాళ్ళకు రకరకాలుగా సహాయపడి రోజుకు అయిదారు రూపాయలు కూడా చేసుకునేవాడు. గెలుపుచేతులను ఉబ్బెయ్యటం రంగయ్యకు లాభించేది.

తండ్రి చచ్చిపోయిన పదేళ్ళకల్లా రంగయ్య ఏడెనిమిది వందలు కూడబెట్టాడు. మరొకడికయితే ఆ డబ్బు ఏనాడో ఖర్చయేది. కొందరికి డబ్బు ఖర్చు చెయ్యటం ఒక వినోదం. రంగయ్యకు ప్రాణ కంటకం. డబ్బు ఖర్చు చెయ్యటంలో ఆనందం అనుభవించేవాడు, కూడబెట్టలేడు. అదీ సిద్ధాంతం. కూడబెట్టే డబ్బు ఎంత అనే విచక్షణ లేదు. దమ్మిడీలూ, దమ్మిడీలో దశాంకాలు కూడా డబ్బే. డబ్బు కూడబెట్టటం ఒక తపస్సు. దానికి నియమాలున్నాయి, నీ అవసరాలు, ఎంతవరకు కొనకుండా గడుస్తాయో చూడు. ఏది అవసరం అనేదాన్ని గురించి కూడా ఇంకోరు చెప్పేది నమ్మకు. రోజుకు రెండుసార్లు తినడం అవసరమని నమ్మేవాళ్లున్నారు. అది మూఢ విశ్వాసం. ఇటువంటి మూఢ విశ్వాసాలు చాలా వున్నాయి. అనేక జబ్బులు మందులు వెయ్యకుండానే పోతాయి. మందులతో రోగాలు పోతే డాక్టర్లు మట్టికొట్టుకుపోతారు చాకలికీ, మంగలికీ ఇచ్చిన డబ్బు వట్టి దండగ. రంగయ్యగారు పుట్టుగడ్డం గొరిగించనే లేదు.

"నేను ప్రపంచంలో ఉండే బిచ్చగాళ్ళనూ, దరిద్రులనూ ఎప్పటికీ మరచిపోలేను. ఒకవేళ ఒక కానీ వృథా చేద్దామనుకుంటే ఆ కానీతో అవసరం ఉన్న అనాథలందరూ జ్ఞాపకం వస్తారు" అంటాడు రంగయ్యగారు.

రంగయ్యగారు జీవితంలో ఎన్నడూ కాయకష్టం చెయ్యలేదు. "కాయకష్టం చేసేవాడు తనకుతానే సేవచేసుకుంటాడు. నేను మొదటినుంచీ ఒకరికింత ఉపకారం చేసి ధనం సంపాదించాను. ప్రతి దమ్మిడీకూడా నేను లోకానికి చేసిన ఉపకారం చాటుతుంది."

ఇది నిజం. రంగయ్యగారు ఆ రోజుల్లో వడ్డీవ్యాపారం చేసేవాడు. రాత్రికి బియ్యానికి లేనివాళ్లూ, అవసరంగా పదిరూపాయలు కావలసివాళ్ళూ, పాతికా పరకా పట్టుకెళ్ళేవాళ్ళే వడ్డీ యిచ్చేవాళ్లు. మంచి వడ్డీయే ఇచ్చేవాళ్ళు. కాని నిర్బంధంలేదు. వాళ్ళంతట వాళ్ళు ఇష్టపడే ఆ వడ్డీకి ఒప్పుకునేవారు. కొందరు పది రూపాయలు పట్టుకెళ్ళి నెలాఖరుకు ఇరవై చేత పెట్టేవాళ్ళు. రేపటి సంగతి ఆలోచించకుండా డబ్బు దొరుకుతున్నది గదా అని పట్టుకుపొయ్యేవాళ్ళే తరవాత పశ్చాత్తాపపడి రంగయ్యను తిట్టేవాళ్ళు. డబ్బు తిరిగి ఇవ్వలేక పొయ్యేవాళ్ళు. కోర్టుకు ఎక్కి అవసరమైనదానికంటే ఎక్కువ ఖర్చు చేసుకునేవాళ్ళు.

ఈ విధంగా రంగయ్య అనేక కుటుంబాలను తన పొట్టన పెట్టుకున్నాడని వాళ్ళ ఊళ్ళోవాళ్ళకు గుర్రుగా ఉండేది. కాని ఆ కుటుంబాలన్నీ చితికిపోయినవే. అవి ఎట్లాగూ దక్కేవికావు. రంగయ్య తెలివిగలవాడుగనక వాటిని తనపొట్టనే పెట్టుకున్నాడు. అంతే.

రంగయ్య ఎన్నడూ చట్టాన్ని వ్యతిరేకించ లేదు. చట్టాన్ని వ్యతిరేకించకుండా బాగుపడే హక్కు ప్రతిమనిషికీ ఉంది. కొందరు అది చాతకాక చట్టంలోని నీతులు చెబుతారు. వాళ్ళను చూస్తే రంగయ్యగారికి తగనిమంట. కాని, ఏమాట కామాటే చెప్పాలి. లోకులు తనకు శాపనార్థాలు పెట్టారనీ, తనవాకిట్లో పేడాపెంటా వేశారనీ, తనమీద చాతబడులు కూడా చేయించారనీ ఆయనకు కోపంలేదు.

ఒకడిబాగు పదిమంది సహించరు. అది సిద్ధాంతం. అందరిచేతా మెప్పులు సంపాదించుకునే వాళ్ళు సర్వనాశనమైపోతారు. సర్వనాశనమై పొయ్యేవాళ్ళని ప్రపంచం మెచ్చుకుంటుంది.

జీవితం అరాచకమైనది. చట్టం ఒప్పుకున్నా ప్రజలు ఒప్పుకోరు. రంగయ్య పాతికేళ్ళు దాటకమునుపే ఉన్న ఊరు వదలి పెట్టేశాడు.

పట్నానికి వచ్చినాక రంగయ్యకు అవకాశాలు హెచ్చాయి. ఇక్కడ మునిసిపాలిటీలున్నాయి. కక్షలున్నాయి. విభేదాలున్నాయి. వ్యాజ్యాలూ ఉన్నాయి. ఇవన్నీ డబ్బు సంపాదించటానికి సాధనాలే. ఇద్దరు తగాదాపడి కోర్టుకెక్కితే ప్రైవేటుకూ, ప్లీడరుకూ, ప్లీడరుగుమాస్తాకూ, స్టాంపువెండరుకూ, ప్రభుత్వానికీ, కోర్టు అమీనులకూ, కాఫీ హోటళ్ళకూ, జట్కా బళ్ళకూ లాభం. మునిసిపాలిటీలలో రెండేసి పక్షాలు తగాదా పడితే ఇంకా ఎంతమందికి ఎంతేసి లాభాలుండొచ్చు?

బస్తీ జీవితంలో చాలా కుళ్ళున్నది. డబ్బు పండించే వాడికిదంతా ఎరువు. రంగయ్యగారు మునిసిపల్ వ్యవహారాలలోనూ, కంట్రాక్టులు వగైరాలల్లోనూ తలదూర్చి ఉట్టుడియంగా డబ్బు చేసుకోసాగాడు. చాలామంది పలుకుబడి గల వాళ్ళ స్నేహం సంపాదించాడు. డబ్బు ఖర్చు చేసేవాడికి దొంగ స్నేహితులు చుట్టూ చేరుతారు. డబ్బు చేసేవాడికి నిజమైన నమ్మకస్తులు తటస్థపడతారు. డబ్బిస్తేనే ఎవరైనా పలుకుతారనేది భ్రమ. మనుషులు డబ్బును చూసి ఎక్కువ భ్రమ పడతారు. చేతిలోకి వచ్చిన డబ్బు మట్టితో సమానం. అందుబాటులోకిరాని ఆడదానిమల్లేనే అందుబాటులోకి రాని డబ్బే మనిషిని బలంగా భ్రమపెడుతుంది. ఇది రంగయ్య స్వానుభవం. ఆడదాని మాటకాదు – డబ్బుమాట. రంగయ్య నిఘంటువులో ఆడవాళ్ళు లేరు.

ఇంతలో యుద్ధం వచ్చింది. రంగయ్య పంటపూర్తిగా పండింది. యుద్ధం జరిగితే వస్తువులు దొరకవనేది చాలామందికి తెలుసు. దాన్ని సరిగా వినియోగపరచుకున్నవాడు

రంగయ్య. అందిన వస్తువులల్లా చాలా కొనేశాడు. అన్నిటికన్నా బంగారం విరివిగా కొన్నాడు. అనేక కంట్రాక్టులు సంపాదించాడు. రెండు చేతులా డబ్బు గడించాడు.

రంగయ్యకు చదువు రాకపోవటం ఏమీ అడ్డంరాలేదు. పెద్ద పెద్ద చదువులు చదువుకున్నవాళ్ళు నెలకు యాభై రూపాయలు పుచ్చుకుని, తనకు అవసరమైనంత సహాయం చేస్తారని రంగయ్య తెలుసుకున్నాడు. చదువుకున్నవాళ్ళు నమ్మకస్తులుగా వుంటారు. ఇంకొకరి డబ్బుమీద వారికి ఆశవుండదు. వాళ్ళకి డబ్బు చెయ్యలేని లక్షణాలన్నీ ఉంటాయి. నీతి వుంటుంది. ఇతరులలో ఈ లక్షణాలుండటం తనకు మంచిదని రంగయ్య తెలుసుకుని చదువుమీదా నీతిమీదా గౌరవం చూపసాగాడు. ఇతరులందరికీ చదువుండడం తనకెంత లాభమో, ఇతరులు నీతిగా ఉండడం తనకు లాభమని రంగయ్య గ్రహించాడు.

యుద్ధ సహాయం చేసాడని రంగయ్యను దేశద్రోహి అనేవాళ్ళు మూఢులు. రంగయ్య దేశభక్తికీ, దేశద్రోహానికీ కూడా అతీతుడు.

ఆయనకి రాజకీయాలతో ప్రసక్తి లేదు. అయినా యుద్ధాన్ని బలపరిచినవాళ్ళను రంగయ్య బలపరిచాడు.

యుద్ధకాలంలో అనేకమందికి పరిశ్రమలమీద ఆసక్తి పుట్టటం కనిపెట్టాడు రంగయ్య. అనేకమంది కన్న రంగయ్య అధికంగా డబ్బు చేశాడు గనక, వాళ్ళు ఆయన సహాయంతో ఆయన వ్యాపారాలు ఆరంభించడానికి సిద్ధపడ్డారు. ఇది తనకెట్లా లాభిస్తుందని రంగయ్య ఆలోచించాడు. వ్యాపారంలో ఉత్సాహం ఎంత సులభంగా పుడుతుందో నిరుత్సాహం కూడా అంత సులభంగానే పుడుతుంది. వ్యాపారంలో డబ్బు పెట్టిన వాళ్ళకు నిరుత్సాహం పుట్టిస్తే, వాళ్ళు తమ వాటాలో సగానికి సగం నష్టపడి అమ్ముకుపోతారు. కంపెనీలు పెట్టి రంగయ్య పాతికవేలు చేసుకున్నాడు. ఆ వ్యాపారాలు సాగనేలేదు. నష్టపడ్డవాళ్ళు రంగయ్యతో కలిసి పెట్టుబడి చేసినవాళ్ళే.

యుద్ధం మూలంగా రంగయ్య ఎంత డబ్బు చేసినా రంగయ్యకు యుద్ధం కంటె అంతకుపూర్వం వచ్చిన ఆర్థిక కాటకమే బాగుంది. "కాటకంలో ప్రతి రూపాయి విలవా మూడు రూపాయలకు హెచ్చింది. నేను చౌక రూపాయలిచ్చి వడ్డీతో సహా ఖరీదైన రూపాయలు పుచ్చుకున్నాను. ఈ యుద్ధంలో రూపాయి ధర అయిదణాలకు దిగిపోయింది. రూపాయి రాదగినచోట ముప్పావలా కూడా రావటంలేదు. ధరలు ఎంత పెరిగినాను!" అన్నాడు రంగయ్య. ఆయనకి ఆర్థిక పరిజ్ఞానం లేదని ఎవరనగలరు?

రంగయ్య నుంచి ఏదైనా నీతి నేర్చుకోవాలని ప్రయత్నించాను. కాని సాధ్యం కావటంలేదు. కారణమేమంటే, ఆయన డబ్బు అపరిమితంగా గడించుతున్నకొద్దీ ఆయన తాత్వికంగా క్షీణిస్తున్నట్టు కనిపిస్తున్నాడు. ఆయన సిద్ధాంతాలు ఏ కారణం చేతో ఇప్పుడు

సూటిగా పనిచెయ్యకుండా వున్నాయి. ఒకప్పుడు చట్టాన్ని అతిక్రమించకుండా మహారాజులాగా డబ్బు కూడబెట్టిన రంగయ్యకు రానురాను అడుగడుగునా చట్టం అడ్డువస్తున్నది. గడచిన పదిహేను నెలల కాలంలోనూ ఆయన రెండు సార్లు వెంట్రుకవాసిలో జైలు తప్పించుకున్నాడు.

ఆయన్నడిగితే చట్టాన్ని తిడతాడు. కాని నా అనుమానం ఏమిటంటే, ఆయన సిద్ధాంతాలను అతిక్రమించి ఆయన ఏదో ఒకటి చేస్తేనేగాని ఇకమీదట డబ్బు చేయడం సాధ్యంకాదు. కొత్త సిద్ధాంతాలు ఆయన అందుబాటులోకి రాకుండా ఉన్నాయి. ఆయన మనస్సు ఏవిధంగా పనిచేస్తున్నదీ నేను పరిశీలనగా చూస్తూ వస్తున్నాను.

'దేశానికి స్వాతంత్ర్యం రావటం అనర్థమయింది. ఈ కాంగ్రెసువాళ్ళే అన్నిటికీ అడ్డంగావున్నారు. ఒక్క అరడజనుమంది దొంగ వెధవల్ని చంపిపారేస్తేగాని పరిస్థితులు బాగుపడవు' అన్న అభిప్రాయాలు ఆయన నోట విన్నాను.

ఈ అభిప్రాయాలు సరిఅయినవి కావని నేను నొక్కి వక్కాణించగలను. స్వరాజ్యం రావటం వల్ల ధనికుల చిక్కులు హెచ్చలేదు. కాంగ్రెసువాళ్ళు ధనిక వర్గానికి ద్రోహం చేస్తున్నారనటానికి ఏమీ ఆధారంలేదు. ఇక హత్యలంటారా, రంగయ్యకు సంబంధించినంతవరకూ అవి గొంతెమ్మ కోరికలే.

ఏమీ సందేహంలేదు. డబ్బు రంగయ్యను ఓడగొట్టుతున్నది. ఈనాటి స్వాతంత్ర్య వాతావరణంలో చల్లని కాంగ్రెసు పరిపాలనకిందా, లేదా హత్యలు చేసీ లక్షలూ కోట్లూ చేసుకోగలవారి జాబితాలో రంగయ్య పేరువేసే అవకాశాలు కనిపించడంలేదు. రంగయ్య మెడతాడు బిగలాగుకుంటున్నది. ఇక ముందరికి పోవటానికి ఎంత ప్రయత్నం చేస్తే అంతగా మెడ బిగుసుకుంటుంది. నలభై దాటినై. ఇక రంగయ్య మారలేడు. తన మనస్తత్వాన్నీ, సిద్ధాంతాలనూ మార్చుకోలేడు. సాంఘికంగా ఆయనకు తోడ్పడదగిన వాళ్ళు కూడా దగ్గిరలేరు. రాబందులు మూగుతున్నాయి. ఇద్దరు దోపిడీదారులు ఎగుమతి పర్మిట్లు సంపాదించి పెడతామని రంగయ్యచేత పదేసి వేలు ఖర్చు పెట్టించి దాటిపోయారు. ఈ భాగ్యంతో రంగయ్య చితికిపోడు గాని, ఇంకా మిగిలివున్న రంగయ్య సొమ్ము ఎలా హరించి పోతుందో చూడవలసి వుంది. రంగయ్య డబ్బుతో కనీసం ఒక వెయ్యి అయినా నా చేతిమీదగా హరించేటట్టు చేసుకునే తాహతు నాకు లేనందుకు నాకే ఎంతో విచారంగా ఉంది.

ముద్రణ: దుక్కిటెద్దు, కథల సంపుటి, 1955 - 59 మధ్య?
జయా పబ్లికేషన్స్, విజయవాడ